ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
బుధవారం 27 నవంబరు 2024

న్యూస్ బాక్స్

ఉచిత గుండె వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జీఎం కాలనీలో కరీంనగర్ మెడికవర్ ఆసుప్రతి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత గుండె వ్యాధి శిబిరాన్ని నిర్వహించారు. ఉచితంగా 2డీ ఎకో, ఈసీజీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో గుండె వ్యాధి నిపుణులు రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యరాణి, దీక్షిత్, గుర్రం కిరణ్, కోట కర్ణాకర్, రాకేష్, యాసిన్, భూమయ్య, సాగర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

వసతిగృహంలో జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి విచారణ

మంథని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని బాలకల వసతి గృహంలో విద్యార్థిని ప్రలోభపెట్టిన హాస్టల్ వంట మనిషి పరారీ అయ్యారు. సోమవారం రాత్రి ఈసంఘటన వెలుగు చూసింది. హాస్టల్ వద్ద ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు వచ్చి విచారించి బాధితురాలు,ఆమె కుటుంబ సభ్యులను పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. వారు స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ సంఘనటకు ప్రధాన సూత్రదారిగా ఉన్న వర్కర్ మాత్రం తప్పించుకొనిపోవడం సంచనలం రేపుతోంది. వర్కర్‌కు సహకరించిన నరేష్ అనే వ్యక్తిని మాత్రం పోలీసులు రాత్రే తమ అదుపులోకి తీసుకొని విచారించి పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపారు. హాస్టల్ జరిగిన సంఘటనపై జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి నాగైలేశ్వర్ విచారణ చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యులు, విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. సంఘటనకు బాధ్యురాలైన వర్కర్‌ను విధుల నుంచి తొగిస్తామన్నారు. వెంట ఎస్ఎస్‌వో మిట్టపల్లి సత్యనారాయణ, వార్డెన్ లావణ్యలు ఉన్నారు.

సర్వే వివరాల నమోదును వేగవంతం చేయాలి

- జిల్లాలో ఇప్పటివరకు నలభై శాతం పూర్తి
- వచ్చేనెల 5లోగా ఆన్‌లైన్ నమోదు పూర్తి
- మొదటి విడతగా గ్రామాల వివరాలు
- జిల్లా చీఫ్ ప్లానింగ్ అధికారి రవీందర్


సమగ్ర సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తున్న సీపీవో రవీందర్

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా ముఖ్య ప్లానింగ్ అధికారి జి. రవీందర్ అన్నారు. సుల్తానాబాద్ మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన మంగళవారం పర్యవేక్షించారు. నమోదులో ఏమైనా ఇబ్బందుల గురించి ఆరాతీశారు. ఈ సందర్భంగా సీపీఓ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం లక్షా ఆరవై ఐదు వేల కుటుంబాల వివరాలను సేకరించడం జరిగిందని, వీటిల్లో ఇప్పటి వరకు యాభై వేల కుటుంబాల వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయడం జరిగిందన్నారు. జిల్లాలో సమగ్ర సర్వే వివరాల ఆన్‌లైన్ నమోదు కోసం అన్ని మండల పరిషత్ కార్యాలయాల్లో, మున్సిపాలిటీల్లో, జేఎన్‌టీయూలలో మొత్తం 720 కంప్యూటర్లను సమకూర్చామని వీటిలో వివరాల నమోదు కోసం 700 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను కూడా నియమించడం జరిగిందని వివరించారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు ముందుగా గ్రామీణ ప్రాంత వివరాల ఆన్‌లైన్ నమోదు పూర్తిచేస్తున్నారని, పూర్తయిన తర్వాత మళ్లీ అర్బన్ వివరాలను నమోదు చేస్తామన్నారు. మొత్తం ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను డిసెంబర్ 5లోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. మండలాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ నమోదును పరిశీలిస్తూ వారికి అవసరమైన సలహాలు సూచనలు అందిస్తూ నమోదు ప్రక్రియన వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ నమోదు ప్రక్రియ ఇలా కొనసాగుతుండగానే సర్వేలో డోర్ లాక్ వారి వివరాలను కూడా వీలున్నపుడు రాబట్టుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మండల పరిషత్ అధికారి పాషా తదితరులు ఉన్నారు.


వివరాల నమోదును పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వేణుగోపాల్

● పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : సమగ్ర ఇంటింటి సర్వే డేటా వివరాలను ఆన్‌లైన్‌లో తప్పులు లేకుండా జాగ్రత్తగా నమోదు చేయాలని పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయాల సమూహంలో టాస్క్ భవనంలో పెద్దపల్లి మండలానికి సంబంధించిన వివరాల నమోదును డీఎల్‌పీవో వేణుగోపాల్ పరిశీలించారు. ఈసందర్భంగా డీఎల్‌పీవో వేణుగోపాల్ మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు సేకరించిన సర్వే వివరాల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా నమోదు చేయాలని, ఆన్‌లైన్ చేస్తున్న వివరాలను ఎప్పటికప్పుడు క్రాస్ చెక్ చేసుకోవాలని సూచించారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి): సామాజిక సమగ్ర ఇంటింటి కులగణన కుటుంబ సర్వే డాటా ఎంట్రీలో తప్పులు దొర్లవద్దని పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంతో జరుగుతున్న డాటా ఎంట్రీని ఆయన పరిశీలించారు. ఎటువంటి తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. మండలంలో 24గ్రామంలో నిర్వహించిన సర్వే వివరాలను 102మంది ఏనుమ్యూరేటర్లు ఎంట్రీ చేస్తున్నారన్నారు. ఆయన వెంట ఎంపీడీవో రామ్మోహన చారి, ఎంపీఓ గోవర్ధన్, ఏపీవో మంజుల, సీనియర్ అసిస్టెంట్ రవి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● రామగిరి (ఆంధ్రజ్యోతి): రామగిరి మండల పరిషత్ కార్యాలయాన్ని మంగళవారం జిల్లాపరిషత్ సీఈవో

మిగతా 8వ పేజీలో..

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు


సుల్తాన్‌పూర్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

ఎలిగేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మౌళిక వసతులను కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో మంగళవారం ప్రజాపాలన-ప్రజావిజయోత్సవాల్లో భాగంగా సీఆర్ఆర్ నిధులు రూ.3కోట్ల 95లక్షలు, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10లక్షలు వెచ్చించి నిర్మించే సీసీ రోడ్లకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రగతి టెక్నో స్కూల్ విద్యార్థులు, కరస్పాండెంట్ కవిత-గర్రెపల్లి సురేందర్ ఎమ్మెల్యేకు బొకే అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు అర్నపల్లి వెంకటేశ్వర్‌రావు, కొండ తిరుపతిగౌడ్, బాలసాని పర్శరాంగౌడ్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, తహసీల్దార్ బషీరోద్దీన్, ఈఈ, డీఈ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, తాటిపల్లి రమేష్‌బాబు, నరహరి సుధాకర్‌రెడ్డి, పల్లెర్ల వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.3కోట్ల విలువైన గంజాయి దహనం


స్వాధీనం చేసుకున్న గంజాయిని పరిశీలిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, నవంబరు 26: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సీజ్ చేసిన 521.544 కిలోల గంజాయిని మంగళవారం దహనం చేసినట్టు పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో 2021 నుంచి వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన 64కేసుల్లో నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎన్‌డీపీఎస్ చట్ట ప్రకారం కోర్టు అనుమతితో న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని ఎఫ్ఎస్ఎల్ కోసం శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో కరీంనగర్ జిల్లా మానకొండూర్ వెంకటరమణ ఇన్సినేటర్ ఫ్యాక్టరీ వద్ద పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేసినట్టు వివరించారు. దహనం చేసిన నిషేధిత గంజాయి విలువ సుమారు రూ.1.3కోట్లు ఉంటుందన్నారు. కమిషనరేట్ డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ సీపీ శ్రీనివాస్, కమిటీ సభ్యులు రామగుండం అడిషనల్ డీసీపీ(అడ్మిన్) ఈ రాజు, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ జీ సతీష్, అడ్మిన్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ ఆధ్వర్యంలో దహనం చేసినట్టు తెలిపారు. ఎన్‌డీపీఎస్ యాక్ట్‌లోని నియమనిబంధనల ప్రకారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేసిన కేసులలో నిల్వ ఉన్న గంజాయిని దహనం చేసినట్టు, కొందరు దురుద్దేశ్యంతో అక్రమార్జనలో భాగంగా అక్రమ గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం స్థానిక, స్పెషల్ టాస్క్‌ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని సీపీ తెలిపారు. ఎవరైనా గంజాయి, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే చట్టరిత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పీడీ యాక్టును కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, జైపూర్ ఏసీపీ ఏ వెంకటేశ్వర్లు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీష్, ఆర్ఐలు దామోదర్, మల్లేశం పాల్గొన్నారు.


విద్యార్థులకు స్పోర్ట్స్ షూ పంపిణీ చేస్తున్న మంత్రి

పదేళ్లలో చేయని ప్రగతిని ఏడాదిలోనే సాధించాం

- ప్రజాపాలన విజయోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

6


మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

- రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ

7

29న దీక్షా దివస్ : మాజీ మంత్రి ఈశ్వర్

పెద్దపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 29న చేపట్టే దిక్షాదివస్‌ను విజయవంతం చేయాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. ఆయన అధ్యక్షతన బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడుతూ దీక్షా దివస్‌కు జిల్లా నలుమూలల నుంచి భారీగా కార్యకర్తలు నాయకులు తరలిరావాలని కోరారు. ఆనాటి తెలంగాణ ఉద్యమాన్ని గుర్తు చేసుకోవడానికే దీక్షా దివస్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ పూర్తిగా అమలుచేయలేదని, కాంగ్రెస్ మోసాలపై గ్రామాల్లో చర్చ పెట్టాలని, బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం రావాలంటే గడపగడపన చర్చ జరగాలన్నారు. ఇందుకు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల్లో కొనసాగుతున్న సర్వే

రామగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని రత్నాపూర్, మేడిపల్లి శివారుల్లో అసైన్డ్, ప్రభుత్వ భూముల సర్వే మంగళవారం రెండవ రోజు కొనసాగింది. తెలంగాణ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ కార్పొరేషన్ ప్రతిపాదనల మేరకు జిల్లా రెవెన్యూ అధికారులు సర్వే చేపడుతున్నారు. రెండు రోజులుగా మేడిపల్లి శివారులో 218ఎకరాలను సర్వే చేపడుతుండగా, అందులో కార్పొరేషన్‌కు అవసరమయ్యే 39.38 ఎకరాలు సర్వే పూర్తి అయినట్లు తెలిసింది. తహసీల్దార్ రామచందర్‌రావు ఆధ్వర్యంలో సర్వే పనులు విస్తృతంగా కొనసాగిస్తున్నారు. కాగా, సదరు భూములకు కొందరు దళారులు అమాయకుల నుంచి డబ్బులు దండుకొని అక్రమంగా పట్టాలు, పాస్‌బుక్కులు ఇప్పించినట్లు తెలిసింది.

వ్యవసాయానికి పనికి రాని భూములనే తీసుకోవాలి

- రైతు సభలో జస్టిస్ చంద్రకుమార్


కార్యక్రమంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

కోల్‌సిటీటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి పనికి రాని భూములను, అటవీ భూములను, ప్రజలకు పర్యావరణ పరంగా నష్టం చేయని భూములను పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వం తీసుకోవాలని జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. మంగళవారం గోదావరిఖని మార్కండేయ కాలనీలో స్నేహ సాహితీ గ్రంథాలయంలో తెలంగాణ రైతు సంక్షేమ సమితి ఆధ్వర్యంలో జరిగిన రైతు సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పరిశ్రమల పేరిట ప్రభుత్వం వేలాది ఎకరాల భూములు తీసుకుంటున్నదని, కానీ అమలులో ఉన్న చట్టాలను మాత్రం పాటించడం లేదన్నారు. పారిశ్రామిక అవసరాల కోసం పాలకులు పంటలు పండే భూములను కాకుండా వ్యవసాయేతర భూములను అటవీ భూములను తీసుకోవాలన్నారు. ప్రజల నివాసాలకు దూరంగా ఉన్న ప్రజల ఆరోగ్యానికి నష్టం చేయని విధంగా దూరంగా ఉన్న భూములు తీసుకోవాలని పేర్కొన్నారు. వ్యవసాయానికి లాభం చేసే గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కల్పించాలని, కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు మార్కెట్లో చొరబడకుండా కట్టడి చేయాలని సూచించారు.

కవి రచయిత స్నేహసాహితీ గ్రంథాలయం వ్యవస్థాపకు లు ఏలేశ్వరం వెంకటేష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు గురిజాల రవీందర్, రైతు సంక్షేమ సమితి నాయకులు ఇంద్రసేన ఉమామహేశ్వర్, వేముల అశోక్, దేవి రాజు, పుట్ట రాజన్న, పోరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రభుత్వ విప్ శంకుస్థాపన


కొత్తపల్లిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అడ్లూరి

ధర్మారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ధర్మారం మండలంలో మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన 19 మంది లబ్దిదారులకు 25 లక్షల 73 వేల రూపాయల విలువగల చెక్కులను అందించారు. ప్రభుత్వం అన్ని విధాలా సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం కొత్తపల్లి గ్రామంలో సీఆర్ఆర్ నిధుల నుంచి మంజూరైన కోటి ముప్పై లక్షలతో నిర్మించనున్న బీటి రోడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి బొమ్మరెడ్డిపల్లి గ్రామానికి చేరుకొని యాదవులకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన గొర్రెల పెంపకం షెడ్లకు భూమి పూజ చేశారు. కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలు నిర్వహిస్తున్న సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ వ్యాప్తంగా వేల కోట్ల నిధులు కేటాయించడం హర్షించదగ్గ విషయమని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సీనియర్ నాయకులు కాడే సూర్యనారాయణ, దేవి జనార్ధన్, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, పాలకుర్తి రాజేశం, అజయ్‌పాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా, రెండు సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలి మరణించిన బొడిగే మల్లేశం కుటుంబానికి సదరు గ్యాస్‌కంపెనీ నుంచి వచ్చిన 6,75,500 రూపాయల ఇన్సూరెన్స్ చెక్కును ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, పాలకుర్తి రాజేశం తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పజ్రా వ్యతిరేక విధానాలపై నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

కళ్యాణ్‌నగర్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖని గాంధీనగర్ పైలాన్ వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ దేశంలో నరేంద్రమోదీ నల్ల చట్టాలను తీసుకవస్తున్నాడని, నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేసి, అందులో పనిచేస్తున్న కార్మికులను బజారున పడవేస్తున్నారని ఆరోపించారు. దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచి పెడుతూ దేశాన్ని విచ్ఛిన్నం చేస్తున్నాడని విమర్శించారు. ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, ఎం దుర్గయ్య, ఎడ్ల రవికుమార్, పైడిపల్లి రమేష్, ఎం కొమురయ్య, ఐ సాంబయ్య, కే మల్లేశం, ఈ సతీష్, ఎండీ పాషా, డీ కృష్ణారెడ్డి, గుండు రాజయ్య, గురుదత్త సాయి, ఎస్ బాలకృష్ణ, కాసర్ల మల్లేష్, సదయ్య, జనార్ధన్, ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

● పెద్దపల్లిటౌన్ (ఆంధ్రజ్యోతి) : కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త నిరసనలో భాగంగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం 3వ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక హక్కులను కాలరాస్తున్నదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యవసాయాన్ని కార్పోరేట్ శక్తులకు అప్పజెప్పే నిర్ణయాలు చేస్తుందన్నారు. వ్యవసాయ కూలీలకు కనీస వేతనం అమలు చేయడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, రైతు సంఘం సహాయ కార్యదర్శి ఎల్. భీమన్న, నాయకులు బొంకూరి సాగర్, కుక్క అన్వేష్, చింతల మరియా, దొడ్డి బాబు, రాజేష్, కడారి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రైతుకార్మిక వ్యతిరేక విధానాలను విరమించుకోవాలని దేశవ్యాప్త నిరసనలో భాగంగా మంగళవారం మండలంలోని గ్రామపంచాయతీ కార్మికవర్గం నిరసన తెలిపారు. పలుడిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ బషీరోద్దీన్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక నాయకులు శ్రీనివాస్, లచ్చయ్య, దేవయ్య, నారాయణ, లక్ష్మణ్, ప్రేమ్‌కుమార్, చంద్రయ్య, సత్యనారాయణ, చిరంజీవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో పోలీసుల ఆకస్మిక తనిఖీలు

కోల్‌సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖనిలో రాత్రిపూట జులాయిల ఆగడాలు మితిమీరుతున్నాయనే ఫిర్యాదులతో వన్‌టౌన్ పోలీసులు సోమవారం అర్ధరాత్రి ఆపరేషన్ చబుత్ర చేపట్టారు. జులాయిలే లక్ష్యంగా కాలనీలు, వీధులు, ఖాళీ స్థలాల్లో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తిలక్‌నగర్, విఠల్‌నగర్, మార్కండేయకాలనీల్లో జులాయిలుగా తిరుగుతున్న యువకులను అదుపులోకి తీసుకుని వారి మోటార్ సైకిళ్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ముఖ్యంగా పట్టణ శివారుల్లో గంజాయి సేవించే ప్రదేశాలను గుర్తించి తనిఖీలు చేశారు. దొంగతనాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి గట్టి ఏర్పాటు చేస్తామని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. రాత్రి 11గంటల తరువాత బైక్‌లపై మెయిన్ రోడ్లపై తిరుగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే సీజ్ చేస్తామన్నారు. ఈ తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ రవీందర్, ఎస్ఐలు రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


నరేందర్(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం నగనూర్ గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫుడ్ డెలివరీ బాయ్ దుద్దెడ నరేందర్(34) దుర్మరణం చెందాడు. పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం సోమారంపేటకు చెందిన నరేందర్ కరీంనగర్ భగత్‌నగర్‌లో అద్దె ఇంటిలో భార్యపిల్లలతో నివాసం ఉంటున్నాడు. నరేందర్ రాత్రి 11 గంటల సమయంలో కరీంనగర్ నుంచి నగనూర్‌కు ఫుడ్ తీసుకువెళ్లి తిరిగి బైక్‌పై వస్తుండగా వెనుక నుంచి మరో బైక్ ఢీకొట్టింది. దీంతో నరేందర్ బైక్‌పై నుంచి ఎగిరి పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కూతురులున్నారు. ఫుడ్ డెలివరీబాయ్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న నరేందర్ మృత్యువాత పడటంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని, ప్రభుత్వం ఆదుకోవాలని మృతుడి బంధువులు విజ్ఞప్తి చేశారు. ప్రమాదానికి కారణమైన బైక్‌పై ఉన్న వ్యక్తి స్థానిక నగునూర్ వైద్యకళాశాల విద్యార్థి కామినేని యువ రాంచందర్‌గా మృతుడి కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపారు.

అగ్నిప్రమాదంలో గాయపడిన ఏఎస్సై మృతి


రామస్వామి(ఫైల్)

కరీంనగర్ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో ఈనెల 17న జరిగిన అగ్నిప్రమాదంలో కాలిన గాయాలతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కరీంనగర్ సీసీ ఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్‌ఐ రామస్వామి మంగళవారం మృతిచెందాడు. కరీంనగర్‌లోని ఇంటిలో గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో రామస్వామి, అతడి భార్య గాయపడ్డారు. తీవ్ర గాయాలతో ఉన్న రామస్వామిని కరీంనగర్‌లో ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడ 9రోజుల పాటు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రామస్వామి కొడుకు కూడా కొన్ని సంవత్సరాల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. రామస్వామి మృతి పట్ల పలువురు పోలీసు అధికారులు సంతాపాన్ని వెలిబుచ్చారు.

దొంగతనం కేసులో
ఇద్దరికి ఎనమిది నెలల జైలు శిక్ష

వేములవాడ టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో ఇద్దరికి 8 నెలల జైలు శిక్షతో పాటుగా వంద రూపాలయ జరిమాన విధిస్తూ వేములవాడ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జ్యోతిర్మయి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం వేములవాడ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రవరం గ్రామంలో మార్చి 3వ తేదిన మల్లికార్జున స్వామి ఆలయంలో దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన ఊరడి రాజిరెడ్డి ఇచ్చిన పిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ముప్పల్ మండలంకు చెందిన నాగరాజు, నిజమాబాద్ జిల్లాకు చెందిన సాయికుమార్‌లు పాల్పడినట్లు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కి తరలించారు. విచారణ అధికారి గోపాల్‌రెడ్డి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా సీఎమ్ఎస్ ఎస్సై రవీందర్ నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ సురేష్ సాక్షులను ప్రవేశపెట్టారని, ప్రాసిక్యూషన్ తరుపున విక్రాంత్ అనే న్యాయవాది కేసు వాదించగా పూర్వపరాలు పరిశీలించిన న్యాయమూర్తి సదరు ఇద్దరు నేరస్తులకు 8 నెలల కారాగార జైలు శిక్షతో పాటు వంద రూపాయాల జరిమానా విదించినట్లు సీఐ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లందకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టేకుర్తి గ్రామం మీదుగా మంగళవారం అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. జమ్మికుంట మండలంలోని తనుగుల గ్రామం నుంచి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకొని ట్రాక్టర్ డ్రైవర్ సంపత్, యజమాని మల్లేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజకుమార్ తెలిపారు.



తీరనున్న కష్టాలు

- ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అదనంగా సాధారణ బోగీలు
- రెండు నుంచి నాలుగు వరకు పెరిగిన బోగీలు
- పలు రైళ్లకు జత చేసిన అధికారులు
- దశల వారీగా అన్నిరైళ్లలో అమలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

దేశవ్యాప్తంగా నడుస్తున్న ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ఉన్న రెండు సాధారణ బోగీలతో ఇబ్బందులు పడుతున్న ప్రయాణికుల కష్టాలు తీరనున్నాయి. అన్ని రైళ్లలో నాలుగు సాధారణ బోగీలను ఏర్పాటు చేయాలని కేంద్ర రైల్వే శాఖ తీసుకున్న నిర్ణయం మేరకు ఆయా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనంగా మరో రెండు బోగీలను అమరుస్తున్నారు. ఈనెల నుంచి పలు రైళ్లలో అదనపు బోగీలను అమర్చడం ప్రారంభించారు. డిసెంబరు నెలాఖరు వరకు సుమారు 800 ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అదనపు బోగీలను అమర్చనున్నారు. దేశంలోని వివిధ రూట్లలో వివిధ రైల్వేలు నడుపుతున్న ఎక్స్‌ప్రెస్, సూపర్ ఫాస్ట్ రైళ్లన్నింటికీ రెండు సాధారణ బోగీలు మాత్రమే అమర్చారు. మిగతా బోగీలు త్రీటైర్, టూటైర్, నాన్ ఏసీ బెర్తలను నడిపారు. వీటిలో ప్రయాణించేందుకు రిజర్వేషన్ సౌకర్యంతో పాటు సీట్లు ఖాళీ ఉంటే స్టేషన్లలో టిక్కెట్లు తీసుకుని ప్రయాణించే సౌకర్యం ఉంది. సాధారణ బోగీలు రెండు మాత్రమే ఉండడంతో ప్రయాణికులు చాలా మంది సీట్లు నిండిన తర్వాత నిల్చుని ప్రయాణిస్తున్నారు. దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లలో సాధారణ ప్రయాణికుల పరిస్థితి మరింత దారుణం. ఎన్నో ఏళ్లుగా ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో సాధారణ బోగీలను పెంచాలనే డిమాండ్ ఉంది. ఆ మేరకు కేంద్ర రైల్వే శాఖ మంత్రులు, అధికారుల దృష్టికి వెళ్లడంతో మరో రెండు సాధారణ బోగీలను జత చేసి నడుపుతామని జూన్‌లో ప్రకటించారు. దీంతో ఈనెల నుంచి పలు రైళ్లకు అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చడం ప్రారంభించారు. వచ్చే నెలాఖరు వరకు దశల వారీగా అన్ని రైళ్లకు అదనపు బోగీలను జత చేయనున్నారని రైల్వే శాఖ అధికారులు పేర్కొంటున్నారు. అదనపు సాధారణ బోగీలను జత చేయడం వల్ల వాటిల్లో ప్రయాణం చేసే వలస కార్మికులకు, దినసరి కూలీలకు, విద్యార్థులకు కొంత ఊరట కలగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైస్‌మిల్ పరిశ్రమలు, ఇటుక బట్టీల పరిశ్రమలతోపాటు భవన నిర్మాణ రంగం, హోటళ్లలో పని చేసేందుకు ఉత్తర భారత దేశం నుంచి వేలాది మంది వలస కార్మికులు పనుల కోసం వస్తున్నారు. అదనపు సాధారణ బోగీలను అమర్చడం వల్ల వలస కార్మికులకు ఎంతో మేలు జరగనున్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి జంక్షన్, రామగుండం, జమ్మికుంట రైల్వేస్టేషన్ల నుంచే వలస కార్మికులు, కూలీలు, ఇతరులు ప్రయాణిస్తుంటారు. జిల్లా మీదుగా నడిచే పలు రైళ్లలో అదనంగా రెండు సాధారణ బోగీలను అమర్చారు.



- జమ్మికుంట, పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్లలో నిలిచే సికింద్రాబాద్ నుంచి దాణాపూర్ పాట్నా నుంచి సికింద్రాబాద్ 12791/92 సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో ఆగే 12295/96 శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు నుంచి దాణాపూర్, పాట్నా నుంచి శ్రీమోక్షగుండం విశ్వేశ్వరయ్య బెంగళూరు సంఘమిత్ర సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఇప్పుడు ఈ రైలులో నాలుగు సాధారణ బోగీలు ఉన్నాయి. ఇప్పటికే మన దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని కాజీపేట నుంచి బల్లార్షా సెక్షన్‌కి సంబంధించిన దూర ప్రాంత రైళ్లలో మన జోన్‌కు, ఇతర జోన్‌లకు చెందిన రైళ్లలో కొన్నింటిలో అమర్చారు.
- జమ్మికుంట, రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12721/22 నాంపల్లి హైదరాబాదు నుంచి ఢిల్లీ నిజాముద్దీన్, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదు దక్షిణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వేస్టేషన్‌లో నిలిచే 12625/26 తిరువనంతపురం నుంచి కొత్త ఢిల్లీ, అక్కడి నుంచి తిరువనంతపురం కేరళ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12615/16 ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి కొత్త ఢిల్లీ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (జీటీ) గ్రాండ్ ట్రంక్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జతచేసి నడుపుతున్నారు.
- సాధారణ బోగీలు లేని ఆంధ్రప్రదేశ్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ 20805/06 విశాఖపట్నం నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి విశాఖపట్నం నడిచే రైలులో నాలుగు సాధారణ బోగీలు జత చేసి నడుపుతున్నారు. ఈ రైలుకు పెద్దపల్లి జంక్షన్, రామగుండం రైల్వేస్టేషన్‌లో హాల్టింగ్ ఉంది.
- ఇప్పటికే పెద్దపల్లి, రామగుండంలో నిలిచే 22152/51 పూణె నుంచి కాజీపేట, కాజీపేట నుంచి పూణె వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12511/12 రప్తిసాగర్ ట్రైవీక్లీ, కోర్బా బైవీక్లీ, అహిల్యానగరి వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు అందుబాటులోకి వచ్చాయి.
- రామగుండం రైల్వే స్టేషన్‌లో నిలిచే 12723/24 నాంపల్లి హైదరాబాదు నుంచి కొత్త ఢిల్లీ వరకు, అక్కడి నుంచి నాంపల్లి హైదరాబాదుకు నడిచే తెలంగాణ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.
- పెద్దపల్లి జంక్షన్‌లో నిలిచే 12656/55 అహ్మదాబాద్ నుంచి ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ నుంచి అహ్మదాబాద్ నవజీవన్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలులో కూడా అదనంగా రెండు సాధారణ బోగీలు జత చేయనున్నారు.

జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఒకరి మృతి

జగిత్యాల అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆస్పత్రిలో బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన అజ్మీర దేశాయి నాయక్(79) అనే వృద్ధుడు మంగళవారం మధ్యాహ్నం మృతి చెందినట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలిసింది. బీర్‌పూర్ మండలం రంగసాగర్ గ్రామానికి చెందిన దేశాయి నాయక్ సోమవారం అనారోగ్య కారణంతో జగిత్యాల ప్రధాన ఆస్పత్రిలో చేరాడు. పరిస్థితి విషమించి మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కాలికి ముల్లు గుచ్చుకుందని ఆస్పత్రికి తీసుకువస్తే అప్పటి నుంచి ఎలాంటి చికిత్స అందించకపోవడం వల్లనే మృతి చెందాడని, మూడు రోజుల క్రితం వరకు చలాకీగా ఉండి కూలీ పనులు చేసాడని కుటుంబ సభ్యులు తెలిపారు. వైద్యులు సరైన చికిత్స అందించక పోవడం వల్లనే చనిపోయాడని మృతుడి బంధువుల ఆస్పత్రి వద్ద రోదించారు.

నాంపల్లి గుట్టపైన లీజు హక్కులకు టెండర్

- సరైన వేలం రాకపోవడంతో రద్దు

వేములవాడ కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన నాంపల్లి శ్రీలక్ష్మీనర్సింహస్వామి వారి దేవస్థానములోని పలు లీజు హక్కులకు బుధవారం ఆలయ ఓపెన్‌స్లాబ్‌లో బహిరంగ వేలము, పేపర్ టెండర్, ఆన్‌లైన్ టెండర్స్ నిర్వహించారు. ప్రమిదలు చమురుతో వున్న వత్తులు అమ్ముకొను హక్కును రెండు సంవత్సరాలకు గాను వేములవాడకు చెందిన బిక్షపతి రూ. 50 లక్షల 55 వేల 555కు దక్కించుకున్నారు. కొబ్బరి కాయలు, పూజ సామాగ్రి అమ్ముకొను హక్కులను జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ అనే వ్యక్తి రూ. 55 లక్షల 55 వేల 999లకు, పప్పు బెల్లం, బొమ్మలు ఆటవస్తువులు అమ్ముకునే లీజును రూ. 10 లక్షల 6 వేల 666కు దాచారం గ్రామానికి చెందిన పర్శరాములకు దక్కగా, కొబ్బరి ముక్కలు ప్రోగుచేసుకునే లీజును జోగాపూర్ గ్రామానికి చెందిన విక్రమ్ రూ. 21 లక్ష 55 వేల 999లకు దక్కించుకున్నారు. నాగఫణీ వద్ద ఇన్ స్టాంట్ ఫోటోలు లీజు హక్కును దాచారంకు చెందిన పర్శరాములు రూ. 24 లక్షల 6 వేల 666 హెచ్చుబిడ్డు ద్వారా టెండర్లను దక్కించుకున్నట్లు ఆఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. కాగా గుట్టపైన క్యాంటీన్ నిర్వహణ లీజు హక్కును ఎవరు డిపాజిట్లు చెల్లించలేదని, నూనె గురుగులు, పాలు అమ్ముకును హక్కు అంశములకు సరియగు వేలం పాట రానందున ఇట్టి రెండు టెండర్స్ వాయిదా వేసినట్లు తెలిపారు.

టెండర్ నిర్వహణలో ఆలయ ఈవో, ఏఈవోలు, సూపరిండెంట్‌లు, దేవాదాయ ధర్మదాయ అసిస్టెంట్ కమిషనర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఖతార్ దేశంలో జగిత్యాల జిల్లా వాసి ఆదృశ్యం?

- ఆరు నెలలుగా తప్పని ఎదురుచూపులు
- భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ ప్రవాసీ ప్రజావాణిలో భార్య ఫిర్యాదు

గొల్లపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లిన ఓ యువకుడు ఆరు నెలలుగా పత్తా లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. తన భర్త ఆచూకీ కనిపెట్టాలంటూ గల్ఫ్ బాధితుడి భార్య రాసూరి సునీత కాంగ్రెస్ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డితో కలిసి మంగళవారం తన కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌లోని ప్రవాసీ ప్రజావాణిలో సీనీయర్ ఐఏఎస్ అధికారిణి దివ్యదేవ రాజన్‌కు వినతి పత్రం సమర్పించింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం దట్నూర్ గ్రామానికి చెందిన రాసూరి రాజేంధర్ కొన్నేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం దోహ-ఖతార్ దేశం వెళ్లాడు. అక్కడే పని చేస్తూ ఉన్న క్రమంలో తన ఉద్యోగం పోయిందని, మాల్టా దేశం వెళ్తానని అందుకు రూ. 5 లక్షలు అవసరమవుతాయని, వాటిని తనకు పంపించాలని ఆరు నెలల క్రితం దట్నూర్‌లో ఉన్న తల్లి, భార్యకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో భార్య సునీత, తల్లి కలిసి బంధుమిత్రులు, తెలిసిన వాళ్ల దగ్గర అప్పు చేసి రాజేందర్‌కు రూ. 5 లక్షల పంపించారు. డబ్బులు పంపించిన అనంతరం రాజేందర్ ఫోన్ స్విచ్చాప్ అయిందని, అప్పటి నుంచి ఇప్పటివరకు ఆరు నెలలుగా అతడి ఆచూకీ లభించడం లేదని బాధితుడి కుటుంబ సభ్యులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. దీనికి స్పందించిన ఐఏఎస్ అధికారిణి దివ్యా దేవరాజన్ వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయించి దర్యాప్తు చేయించాలని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి నరేష్‌ను ఆదేశించినట్లు బాధితురాలు సునీత తెలిపారు.


ప్రజావాణి నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌కు మొరపెట్టుకుంటున్న బాధిత కుటుంబ సభ్యులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

గంభీరావుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట తసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించకుంటే మధ్యాహ్న బోజనం సరుకులు ఎలా తెచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే లక్షల కొద్ది అప్పులు తెచ్చి వంట చేస్తుంటే అధికారులు తనిఖీల పేరిట ఇబ్బంది పెడుతున్నారన్నారు. నిత్యావసరాల ధరలు రోజు రోజుకు ఆకాశానంటుతున్నాయన్నారు. మెస్ చార్జీలు పెంచక మూడేళ్ల దాటిందని, నిత్యావసర సరుకులు ప్రభత్వమే సరపరా చేయాలని అన్నారు. గ్యాస్ సిలిండర్లు ప్రభుత్వమే సరపరా చేయాలన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట దర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు


అంతకుముందు వినతి పత్రాలు అందజేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీసం లక్ష్మణ్, కార్మిక సంఘం నాయకులు రాజమణి, మహేశ్వరీ, రేఖ, లక్ష్మణ్, వరలక్ష్మి, నిర్మల, బాలవ్వ, జ్యోతి, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతికి మంత్రి పరామర్శ


గొట్టె భూపతిని పరామర్శిస్తున్న శ్రీధర్‌బాబు

కరీంనగర్ అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మాజీ ఎంపీ గొట్టె భూపతి సతీమణి, రాచకొండ పోలీస్ కమిషనర్ గొట్టె సుధీర్‌బాబు తల్లి గొట్టె శాంత రెండు రోజుల కిందట మరణించగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళవారం పరామర్శించారు. కరీంనగర్ మంకమ్మతోటలోని నివాసానికి వెళ్లిన మంత్రి గొట్టెభూపతి, సుధీర్‌బాబులను కలిసి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మంత్రితో పాటు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు సమద్‌నవాబ్, ఎండీ తాజ్ తదితరులు ఉన్నారు.

వైద్య కళాశాలకు పార్థివదేహం


లక్ష్మి పార్థీవదేహాన్ని వైద్య కళాశాలకు అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సుభాష్‌నగర్/కరీంనగర్ రూరల్/కల్చరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యావేత్త, రచయిత వీరగోని పెంటయ్య సతీమణి వీరగోని లక్ష్మి(65) పార్థివదేహాన్ని మంగళవారం చల్మెడ ఆనందరావు మెడికల్ కళాశాలకు అందజేశారు. ఈనెల 23న రాత్రి లక్ష్మి గుండెపోటుతో మరణించారు. గత ఏడాది వీరగోని పెంటయ్య, లక్ష్మీ దంపతులు మరణానంతరం దేహదాన అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు. వారి కోరిక మేరకు కుమారుడు, కూతురు అమెరికా నుంచి మంగళవారం వచ్చి అంతిమయాత్ర నిర్వహించి పార్థివదేహాన్ని మెడికల్ కాలేజీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో వీరగోని పెంటయ్య, కుమారులు నరేష్, సురేష్, కుమార్తెలు సమత, సౌజన్య, డాక్టర్ బి లచ్చయ్య, రఘుశంకర్ రెడ్డి, శ్రావణ్‌కుమార్, కనకయ్య, రాజేందర్, బుర్ర తిరుపతి, సీవీ కుమార్, డి అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

వీరగోని పెంటయ్య కుటుంబాన్ని మంత్రి శ్రీధర్‌బాబు పరామర్శించారు. ఆయన వెంట సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పదేళ్లలో చేయని ప్రగతిని ఏడాదిలోనే సాధించాం

- ఎల్‌మడుగు, రామగిరి ఖిల్లాను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తాం
- మంథనిలో సిల్క్ డెవలమెంట్ సెంటర్, మహిళ పారిశ్రామిక పార్కు
- మంథని వద్ద గోదావరి నదిపై రూ. 1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం
- ప్రజాపాలన విజయోత్సవంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, నవంబరు 26: రాష్ట్రంలో గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేయని అభివృద్ధి పనులను తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలోనే సాధించామని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవం కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దివాలా తీసిన ఆర్థిక క్రమశిక్షణతో సీఎం రేవంత్‌రెడ్డి, తమ మంత్రివర్గం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయటానికి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని అనేక పథకాలతో ముందుకు సాగుతున్నామన్నారు. ఎన్నికల హామీలో ఆరు గ్యారెంటీల్లో అధికారంలోకి వచ్చిన వెంట నే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500కు సబ్సిడీపై గ్యాస్ సిలెండర్, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అమలు చేస్తున్నామన్నారు. స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు త్వరలోనే రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. మిగిలిన వాటిని త్వరలో అమలు చేయటానికి కృషి చేస్తున్నారు. రైతులకు, కౌలు రైతులకు ఎంఎస్‌పీతో పాటు సన్న వడ్ల రూ.500 బోనస్ ఇస్తున్నామన్నారు. గింజ తరుగు లేకుండా రైతుల వడ్లను కొనుగోలు చేస్తున్నామన్నారు. ఏడాదిలోనే నెలకు 5 వేల ఉద్యోగాల చొప్పున 55 వేల మంది చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇచ్చామన్నారు. పదేళ్లుగా ఆగిపోయిన ఉద్యోగుల బదీలు, పీఈటీలకు ప్రమోషన్లను తమ ప్రభుత్వం క్లియర్ చేసిందన్నారు. అనేక పరిశ్రమల్లో నిరుద్యోగ యువతకు స్కిల్స్ డెవలప్ చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారు. ఏడాదిలో అనేక కార్యక్రమాల అమలుతో ముందుకు సాగుతున్న తమ ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఇంకా విమర్శించడం ఎందుకని ప్రశ్నించారు. వారికి తమ పని తీరుతోనే జవాబు చెప్తామన్నారు. ఏడాదిలో తమ ప్రభుత్వ సాధించిన ప్రగతిని ప్రజలకు తెలియజేసి వారి ఆశీర్వాదం తీసుకోవటానికి ప్రజా విజయోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లాను, మంథని నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతామన్నారు. మంథనిలో, పెద్దపల్లిలో జిల్లా, డివిజన్ స్థాయిల్లో మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తామన్నారు. మంథని గోదావరినదిపై రూ.1.20 కోట్లతో బ్రిడ్జి నిర్మించి వ్యాపారపరంగా అభివృద్ధి చేస్తామన్నారు. కూచిరాజ్‌పల్లి, బోయినిపేటల మీదుగా బైపాస్ రోడ్డును నిర్మిస్తామన్నారు. మంథనిలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మహిళా పారిశ్రామిక పార్కును ఏర్పాటుచేసి మహిళలకు ఉపాధి అవకాలు కల్పిస్తామన్నారు. గోదావరినదిలోని ఎల్.మడుగు ఇరువైపులా అభివృద్ధి చేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇందుకు రూ.7కోట్లతో ఖానాపూర్ పిడబ్ల్యూడీ రోడ్ నుంచి ఎల్. మడుగు వరకు డబుల్ రోడ్ నిర్మాణానికి శంకుస్థాన చేశామన్నారు. రామగిరి ఖిల్లాను సైతం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు ద్వారా సొంత భవనాలు లేని గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాల నిర్మాణం కోసం నిదులు కేటాయించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలుచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణు, మున్సిపల్, పీఏసీఎస్ చైర్మన్లు పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

చికిత్స పొందుతూ గిరిజన బాలిక మృతి


రక్షిత(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): చిన్న విషయానికి మానసిక ఆందోళనకు గురై ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని గిరిజన బాలిక మాలోతు రక్షిత(17) స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. వారి కథనం మేరకు.. మండలంలోని దేవునిగుట్ట తండా గ్రామ పంచాయతీ పరిధిలోని చింతకుంటతండాకు చెందిన మాలోతు మంజుల-తిరుపతి దంపతులకు ఇద్దరు పిల్లలు రక్షిత, రాహుల్ ఉన్నారు. తిరుపతి 14 ఏళ్ల కిందట భార్యాపిల్లలను వదిలి వెళ్లిపోయాడు. దాంతో మంజుల కూతురు రక్షిత, రాహుల్‌ను తీసుకుని 10 ఏళ్ల కిందట ఎల్లారెడ్డిపేట గ్రామానికి చేరుకుంది. ఓ గదిని అద్దెకు తీసుకుని బట్టల దుకాణంతో పాటు కుట్లు, అల్లికలతో ఉపాధి పొందుతూ పిల్లలను సాకుతోంది. కూతురు రక్షిత దుమాల ఈఎంఆర్ఎస్ కళాశాలలో ఇంటర్ చదివి గత యేడాది అనుత్తీర్ణురాలైంది. దాంతో అప్పటి నుంచి తల్లికి చేదోడువాదోడుగా ఉంటోంది. మానసిక స్థితి సరిగా లేక ఆందోళనకు లోనైన ఆమె ఈ నెల 20న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబీకులు రక్షితను స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

సంస్కృతిని పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే

● శాతవాహన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఉమేష్ కుమార్



యూనివర్సిటీలో బతుకమ్మ ఆడుతున్న ఎస్‌యూ వైస్ చాన్స్‌లర్ ఉమేష్‌కుమార్ దంపతులు

గణేశ్‌నగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సంస్కృతిని, సంప్రదాయాలను పరిరక్షించాల్సిన బాధ్యత యువతదే అని శాతవాహన విశ్వవిద్యాలయ ఉప కులపతి ఆచార్య ఉమేష్ కుమార్ అన్నారు. మంగళవారం శాతవాహన విశ్వవిద్యాలయం కాలేజీ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఎత్నిక్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వీసీ ఉమేష్ కుమార్ సతీసమేతంగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి ఉత్సవాలను నిర్వహించడం వల్ల యువతకు మన సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలుగుతుందన్నారు. అంతకముందు విద్యార్థులు బోనాలు, పల్లకితో అమ్మవారిని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఊరేగింపుగా తీసుకువచ్చారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉగాది, దీపావళి, సంక్రాంతి, కృష్ణాష్టమి, క్రిస్మస్, వినాయక చవితి, బోనాలు, బతుకమ్మ, దసరా పండుగలను ఘనంగా నిర్వహించారు. ఉప కులపతిచే ఉట్టి కొట్టించి, జమ్మి పూజ చేసి రావణ దహనం చేయించారు. అనంతరం వీసీ దంపతులు బతుకమ్మ ఆడారు. విద్యార్థులు, అధ్యాపకులు అన్ని పండుగలకు సంబంధించిన 200 రకాల పిండి పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ మనోహర్, అధ్యాపకులు డాక్టర్ తిరుపతి, డాక్టర్ కృష్ణకుమార్, డాక్టర్ మనోజ్, డాక్టర్ నరేష్, డాక్టర్ పరశురాములు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా వసంత్ కుమార్



వసంత్ కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మహారాష్ట్రలోని పూణే పట్టణంలోని ఛత్రపతి స్పోర్ట్స్ స్టేడియంలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1 వరకు నిర్వహించనున్న 27వ జాతీయస్థాయి కరాటే పోటీలకు చీఫ్ అఫీషియల్‌గా జిల్లాకు చెందిన కే వసంత్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ ఎస్ శ్రీనివాసన్ నుంచి ఆదేశాలు అందుకున్నట్లు వసంత్‌కుమార్ పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో ఒకరి మృతి

బోయినపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బోయినపల్లి మండలం మల్కాపూర్‌లో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొడిమ్యాల మండలం నల్లగొండ గ్రామానికి చెందిన నాంపల్లి (49) అనే వ్యక్తి నల్లగొండ గుట్ట ప్రాంతానికి సోమవారం అడవి పందుల వేట కోసం వెళ్లినట్లు సమాచారం. నాంపల్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గుట్ట శివారు ప్రాంతంలో గాలింపు చేపట్టారు. నాంపల్లి విద్యుదాఘాతానికి గురై కనిపించడంతో పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ మోతీలాల్ తెలిపారు.

కోనోకార్పస్‌తో ముప్పు..!



హుజూరాబాద్ నుంచి జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి మధ్యలోని డివైడర్ మధ్యలో ఏపుగా పెరిగిన కోనోకార్పస్ చెట్లు

- పుప్పొడితో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- మొక్కలు తొలగించాలని కోరుతున్న ప్రజలు
- ప్రజాప్రతినిధులు స్పందించాలి

హుజూరాబాద్‌రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంబడి, పట్టణాల్లోని డివైడర్ల మధ్య సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నాటిన కోనోకార్పస్ మొక్కలు పర్యావరణానికి పెను ముప్పుగా మారాయి. శ్వాసకోశ సంబంధిత వ్యాధులకు కారణమవుతున్న ఈ మొక్కలను తొలగించాలని పర్యావరణవేత్తలు కోరుతున్నారు. అధికారులు అక్కడక్కడా తొలగించి చేతులు దులుపుకున్నారు. ఏపుగా పెరుగుతున్న ఈ మొక్కలు వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగనివ్వకుండా పర్యావరణానికి హాని కలిగిస్తుంది. మనుషులతో పాటు జంతువులకు కూడా హాని ఇవి హానికరమని అంటున్నారు. ఈ చెట్ల మీద ఒక పిట్ట కూడా వాలడం లేదంటే పర్యావరణానికి ఇవి ఎంతో హానికరమో ఇట్టే అర్థమవుతుంది. హుజూరాబాద్ నుంచి శాలపల్లి-ఇందిరానగర్ గ్రామం వరకు ఇటు హుజూరాబాద్ నుంచి బోర్నపల్లి వరకు, కొత్తపల్లి వరకు ప్రధాన రహదారుల మధ్య కోనోకార్పస్ చెట్లు ఏపుగా పెరిగాయి.

● **అవెన్యూ ప్లాంటేషన్., రహదారుల పక్కన**

గత ప్రభుత్వ హయాంలో పచ్చదనం-పరిశుభ్రత, హరితహారం కార్యక్ర మంలో భాగంగా ప్రభుత్వం కోనోకార్పస్ ఒక్కో మొక్కను రూ. 50లు వెచ్చించి కొనుగోలు చేసి నాటించారు. వారాల వ్యవధిలో ఈ మొక్కలు విపరీతంగా పెరిగి వేర్లు కూడా భూమిలోకి లోతుగా వెళ్లి వాటి పరిసరాల్లో మరే మొక్కను పెరగ నివ్వకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్‌లో భాగంగా భారీ సంఖ్యలో మొక్కలను నాటారు. అలాగే ప్రకృతి వనంలో, గ్రామాలకు వెళ్లే ప్రధాన రహ దారుల పక్కన ఏపుగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు దర్శనమిస్తున్నాయి.

● **చూడడానికి ఆహ్లాదంగానే.. కానీ..**

పచ్చదనంతో నిండుకుని ఉన్న ఈ చెట్లను చూస్తే ఆహ్లాదకరంగానే ఉంటుంది. కానీ మొక్కలు పూతకు వచ్చినప్పుడే అత్యంత ప్రమాదకరంగా మారుతోంది. ఈ మొక్కల నుంచి వెలువడే పుప్పొడి రేణువుల వల్ల మనుషుల్లో అలర్జీ, శ్వాసకోశ వ్యాధులు, అస్తమా వంటి జబ్బులు రావడమే కాకుండా చివరి వరకు అది కేన్సర్‌కు దారి తీసే అవకాశం ఉందని శాస్త్రవేత్తల పరిశోధనలో తేలింది. దీంతో ఈ మొక్కలను తొలగించాలని గత ప్రభుత్వ హయంలోనే అధికారులు తీర్మానం చేసినప్పటికీ అక్కడక్కడా రోడ్డు పక్కన తొలగించారు. కానీ గ్రామాల్లో ఉన్న చెట్లను మాత్రమే వదిలేశారు. పలు పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఈ మొక్కలే ప్రధానంగా కనిపిస్తున్నాయి. రోడ్డు పక్కన, ప్రధాన రోడ్డు మధ్యలో నాటిన ఈ మొక్కల వేళ్లు భూమిలోకి లోతుగా పాతుకుపోయి అడ్డు వచ్చే కేబుల్ వైర్లు, వాటర్ పైప్‌లైన్లను ధ్వంసం చేస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పర్యావరణానికి హాని కలిగించే మొక్కల నుంచి ప్రజలకు, జంతువులకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రజాప్రతినిధులు స్పందించాలి



కోనోకార్పస్ మొక్కలు చాలా గ్రామాల్లో నాటారు. నిత్యం ప్రజలు ఈ మొక్కల పక్క నుంచి వెళ్తున్నారు. మొక్కలు ప్రాణాంతకమని తెలిసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా స్పందించి వాటిని తొలగించి నీడనిచ్చే ఇతర మొక్కలు లేదా పండ్ల మొక్కలు నాటాలి.

- వేల్పుల ప్రభాకర్, పర్యావరణ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు

వెంటనే తొలగించాలి



పచ్చదనం పేరుతో నాటిన మొక్కల్లో సగం వరకు కోనోకార్పస్ మొక్కలే ఉన్నాయి. ఎక్కడ చూసినా రోడ్డు వెంట ఈ మొక్కలే దర్శనం ఇస్తున్నాయి. ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు స్పందించి వెంటనే తొలగించాలి. వాటి స్థానంలో ఇతర ఉపయోగపడే మొక్కలు నాటాలి.

-బింగి కరుణాకర్, బీజేపీ జిల్లా కార్యదర్శి, రంగాపూర్.

జాతీయ స్థాయి పోటీలకు సైనిక్ స్కూల్ విద్యార్థి



హోమ్ రాజ్

చొప్పదండి, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక అయ్యాడు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో ఈనెల 30వ తేదీ వరకు జరగబోయే అండర్ 17 విభాగంలో జాతీయ స్థాయి అథ్లెటిక్స్ ఛాంపియన్ షిప్ 400 మీటర్ల రన్నింగ్ పోటీలకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థి కె. హోమ్‌రాజ్ ఎంపికయ్యాడు. కాగా హోమ్‌రాజ్‌ను స్కూల్ డైరెక్టర్ కర్నల్ కేసీ రావు, ప్రిన్సిపాల్ కాళహస్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

యువకుడి మృతిపై అనుమానాలు

- నాలుగు రోజుల క్రితం మృతి
- పంచనామా చేసిన అధికారులు

ఇల్లంతకుంట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని ఒగులాపూర్ గ్రామానికి చెందిన పెంటల శ్రీనివాస్ (40) అనే యువకుడి మృతిపై అనుమానాలు తలెత్తడంతో అధికారులు పంచనామా నిర్వహించారు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. శ్రీనివాస్ నాలుగు రోజుల క్రితం మృతిచెందాడు. దీంతో కుటుంబ సభ్యులు సాధారణ మృతి అని చెప్పి అంత్యక్రియలు నిర్వహించారు. తన తమ్ముడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, అక్క విజయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తహసీల్దార్ ఫారూఖ్, ఎస్సై శ్రీకాంత్‌గౌడ్, సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు ఫాతిమా మంగళవారం ఒగులాపూర్ గ్రామానికి చేరుకొని ఎముకలు, బూడిదను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. రిపోర్టు ఆధారంగా చర్యలు ఉంటాయని అధికారులు తెలిపారు.

గుంతలో పడి వాహనదారుడికి తీవ్ర గాయాలు

ఎల్లారెడ్డిపేట, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లి గ్రామ శివారులోని కామారెడ్డి- సిరిసిల్ల ప్రధాన రహదారిపై మంగళవారం రాత్రి గుంతలో పడి బొప్పాపూర్‌కు చెందిన వాహనదారుడు బిస్క సత్యం తీవ్ర గాయాలపాలయ్యాడు. క్షతగాత్రుడిని మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సత్యం తన ద్విచక్రవాహనంపై గొల్లపల్లి గ్రామ శివారులోని పెట్రోల్ బంక్‌లో పెట్రోలు పోయించుకుని తిరిగి వస్తున్న క్రమంలో వాహనం గుంతలో పడి అదుపు తప్పింది.

ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు

● **మంత్రి కొండా సురేఖ**



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కొండా సురేఖ



కార్మిక దంపతులు, చిన్నారికి నూతన వస్త్రాలు అందిస్తున్న మంత్రి సురేఖ

పెద్దపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలోని ఆలయాల భూములను అన్యాక్రాంతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వాటిపై సర్వే నంబర్‌ల వారిగా విచారణ చేపడుతుందని రాష్ట్ర దేవాదాయ, ధర్మదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మంగళవారం పెద్దపల్లి మండలం సబ్బితం గ్రామంలోని సీతారామాంజనేయ స్వామి దేవాలయాన్ని 50 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావుతో కలిసి శంకుస్థాపన చేశారు. అంతకు ముందు గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు రంగాపూర్ గ్రామం నుంచి మంత్రి, ఎమ్మెల్యేను ద్విచక్ర వాహనాలతో స్వాగతం పలుకగా ఆలయ సమీపంలో మంత్రిని ఎడ్లబండి ఎక్కించి ఆలయం వరకు మహిళలు కోలాట నృత్యాలతో స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రి, ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రమైన యాదాద్రిని నిర్మించినా భక్తులకు ఎలాంటి వసతులు కల్పించలేదన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో భక్తులకు తాగునీరు, వసతులు కల్పించామన్నారు. అలాగే యాదాద్రి ఆలయ గోపురానికి బంగారు తొడుగును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యదాద్రి వద్ద వికలాంగులకు లిఫ్ట్ సౌకర్యం, బ్యాటరీ కార్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అలాగే వేములవాడ ఆలయాన్ని సైతం అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆలయాల్లో ఉన్న వెండి, బంగారంతో ఆలయానికి ఉపయోగపడే ఆభరణాలు, అలంకరణ వస్తువులు తయారుచేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి ఆలయంలో ఉన్న బంగారం, వెండిని లెక్కించి వాటితో వెండి పల్లకీలను తయారుచేయించి నూతనుత్తేజం ఉండేవిధంగా ఆలయాల్లో కార్యక్రమాలు చేపడుతామన్నారు. రాష్ట్రంలోని ఆలయాల భూములు కబ్జాలకు గురవుతున్నాయని, వాటిని త్వరలోనే అధికారులతో సర్వే చేయించి స్వాధీనం చేసుకుంటామన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలోని ఎండోమెంట్ పరిధిలోని ప్రతి ఆలయానికి టీటీడీ నుంచి వచ్చే నిధులు రాకుండా చేసిందని ఆరోపించారు. పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మల్లికార్జున స్వామి ఆలయానికి సబ్బితం ఆలయం అనుసంధానం చేయనున్నట్లు, ప్రతినెల నిర్వహణ ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు రానున్నట్లు తెలిపారు. గ్రామస్థులు సైతం ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ సుప్రియ, పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ బండారి రాంమ్మూర్తి, మాజీ ఎంపీటీసీ కలబోయిన మహేందర్, చంద శంకర్, చుంచు సదయ్య పాల్గొన్నారు.

కార్మిక దంపతులను చూసి చలించి..

- దుస్తులు, చెప్పులు కొనిచ్చిన మంత్రి

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లాలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు మంత్రి కొండా సురేఖ వెళ్తుండగా సుల్తానాబాద్ పట్టణంలో పూసాల చౌరస్తా సమీపంలో తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న చిన్నారిని గమనించారు. కారు ఆపి దిగి ఆమె వద్దకు వెళ్లారు. చెప్పులు లేకుండా చిన్నారిని రోడ్డుపై నడిపిస్తున్న ఒడిశా కార్మిక దంపతుల మందలించారు. వారిని తనతో పాటు ఓ చెప్పుల షాపులోకి తీసుకువెళ్లి ముగ్గురికి చెప్పులు కొనిచ్చారు. ఆ తర్వాత బట్టల షాపులోకి తీసుకవెళ్లి దుస్తులు కొనిచ్చారు. మంత్రి ఔదార్యాన్ని పలువురు అభినందించారు.

జస్టిస్ స్వామినాథన్ కమిషన్

సిఫార్సులను అమలు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

సిరిసిల్ల కలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతాంగ అభివృద్ధి కోసం జస్టిస్ స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా అమలు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ కలెక్టరేట్ ఎదుట మంగళవారం ఏఐటీ యూసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రైతులు, నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ చెప్పిన విధంగా పంట దిగుబడి అయ్యే వరకు ఎంత ఖర్చు అయ్యిందో దానికి అదనంగా 50 శాతం ధరను పెంచి పంటలకు రేటు నిర్ణయించాలని, కానీ అమలు కావడం లేదని అన్నారు. దీనికి తోడు రైతు దేశంలో ఎక్కడైనా పంటను అమ్ముకోవచ్చని చెప్పినా కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లేక దళారుల రాజ్యంగా మారిపోయిందన్నారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ శక్తులకు, ఎఫ్‌డీఐలకు అనుకూలంగా మార్చిందని, 8 గంటల పని విధానానికి బదులు 12 గంటల పని భారాన్ని అమలు చేసే ప్రయత్నం జరుగుతోందని అన్నారు. సింగరేణి, రైల్వేలను ప్రైవేటు పరం చేసేందుకు కుట్రలు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య దేశంలో విద్య, వైద్యం, కార్పొరేట్ శక్తుల గుప్పిట్లోకి వెళ్తున్నాయని, దానిని నిరోధించాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కేవీ అనసూయ, పోచయ్య, మల్లయ్య, నర్సయ్య, చంద్రయ్య, మారుతి, నర్సింగోజి, ఏఐఎఫ్‌టీయూ నాయకులు సోమిశెట్టి దశరథం, గుజ్జె దేవదాస్ ఉన్నారు.

40 ఏళ్ల ఓవర్‌హెడ్ ట్యాంకు కూల్చివేత



నేలకూలిన ట్యాంకు

గంగాధర, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 40 సంవత్సరాలుగా గ్రామస్థులకు తాగు నీరందించిన ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరగా అధికారులు మంగళవారం కూల్చి వేశారు. గంగాధర మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి ఎదురుగా 40 ఏళ్ల క్రితం ఓవర్‌హెడ్ ట్యాంకును నిర్మించారు. ట్యాంకు పక్కన గ్రంథాలయం, ప్రజల ఇళ్లు ఉండగా అధికారులు కూల్చడంలో జాగ్రత్తలు తీసుకున్నారు. ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోకుండా సురక్షితంగా ట్యాంకును కూల్చి వేశారు.

ఆలయాల్లో కార్తీక పూజలు

- ధర్మపురి క్షేత్రంలో పెరిగిన భక్తుల రద్దీ
- వేములవాడలో బద్దిపోచమ్మకు బోనం
- కొండగట్టులో భక్తుల పూజలు



కొండగట్టులో క్యూలైన్‌లో వస్తున్న భక్తులు



ధర్మపురి వద్ద గోదావరికి హారతి ఇస్తున్న అర్చకులు



వేములవాడలో భక్తులతో కిక్కిరిసిపోయిన బద్దిపోచమ్మ ఆలయ ప్రాంగాణం

ధర్మపురి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో కార్తీక భక్తులరద్దీ మంగళవారం పెరిగింది. స్థానిక లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ ఆలయా లు భక్తులతో కిటకిటలాడాయి. గోదావరి నదిలో భక్తులు కార్తీకస్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజ లు, కుంకుమార్చన, స్వామివారల నిత్యకళ్యాణం జరిపించారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కు మార్‌శర్మ, అర్చకులు, నిత్యపూజలు, అభిషేకాది కార్యక్ర మాలు నిర్వహించారు.

25 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీకమాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 25వ రోజు మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఆలయ వేదపండితులు, అర్చకులు గోదావరినది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం విశేష పూజలుచేసి నదీ మాత కు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేములవాడ కల్చరల్ : వేములవాడ బద్దిపోచమ్మ అమ్మ వారికి భక్తులు బోనం మొక్కులు చెల్లించుకున్నారు. సోమ వారం రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు మంగళవారం తెల్లవారు జాము నుంచి అమ్మవారి దర్శనానికి బారు లుదీరారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో సుమారు నాలుగు గంటలపాటు భక్తులు నెత్తిన బోనాలతో వేచి చూశా రు. అనంతరం పట్నాలువేసి ఒడిబియ్యం సమర్పించారు.

వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ కొన సాగుతోంది. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు రాజ రాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు.



బద్దిపోచమ్మ దర్శనం కోసం క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సామూహిక కార్తీక దీపోత్సవం కొనసా గుతోంది. కార్యక్రమాన్ని ఆలయాధికారులు మంగళవారం జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు.

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని సన్నిధానం మంగళవారం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రద్దీగా మారింది. కొండపైకి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించు కున్నారు. వేకువ జాము నుంచే వందలాది వాహనాలు, కాలిన డకన కొండపైకి చేరుకున్న భక్తులు అంజన్నకు మొక్కులు తీర్చుకున్నారు. మహిళ భక్తులు ఆలయం ముందుగల రావి చెట్టు వద్ద దీపాలు వెలిగించి కార్తీకపూజలు చేశారు.

కొండగట్టు అంజన్న ఆలయంలో నెల రోజులుగా నిర్వహి స్తున్న సామూహిక కార్తిక దీపోత్సవంను మంగళవారం పర్య వేక్షకులు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, అశోక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

న్యూస్ బాక్స్

కూలర్ల దాతకు సన్మానం

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ వివాహాన్ని పురస్కరించుకుని సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ప్రియతమ్ దంపతులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు రెండు కూలర్లను ఇటీవల బహూకరించగా, మంగళవారం వాటిని స్కూల్‌లో ప్రారంభించారు. ప్రియతమ్ దాతలతో పాటు అతడి తల్లిదండ్రులు స్వామి-అంజలిని హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి తిరుపతి, దొడ్ల సందీప్ గాజుల అంజయ్య సరిత ఉన్నారు.

బసంత్‌నగర్‌లో గ్రామ సభ

పాలకుర్తి,నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని బసంత్‌నగర్ గ్రామ పంచాయతీ ఆవరణలో మంగళవారం జరిగిన గ్రామ సభలో పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో ఉప్పు సుదర్శన్,పంచాయతీ కార్యదర్శి గంగాలక్ష్మి పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటరు లిస్ట్ సవరణపై సమావేశం

పాలకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఓటరు లిస్ట్ సవరణపై అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో పొల్సాని శశికళ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండల స్థాయి ముసాయిదా గ్రామపంచాయతీ ఓటర్ లిస్ట్ జాబితా సవరణపై సమావేశం నిర్వహించినట్లు ఎంపీడీవో తెలిపారు. మేరుగు ఉదయ్, నలిగంటి శ్యామ్ కుమార్, రెడపాక వివేక్, ఎంపీవో ఉప్పు సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

ఎలిగేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు యాసంగి పంట సాగుకు ముందు వరికొయ్యలను కాల్చకుండా కలియదున్నాలని ఏవో ఉమాపతి తెలిపారు. మంగళవారం స్థానిక రైతు వేదికలో జీరో టిల్లెజ్ పద్ధతిలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సమావేశంలో ఏఈఓలు సురేష్, గణేష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే తరలించాలి

ఎలిగేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని అలాట్ చేసిన రైస్‌మిల్లుకు వెంటనే తరలించాలని అడిషనల్ ఆర్‌డీవో రవికుమార్ సంబంధించిన అధికారులను ఆదేశించారు. ఎలిగేడులో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏపీఎం సుధాకర్‌తో కలిసి పరిశీలించారు.వెంట సీసీలు ఆనంద్, జ్యోతి, వీవో అధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు మహాపాదయాత్ర

ఎలిగేడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ నుంచి వేములవాడ వరకు మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు నాయకుడు బింగి రాజు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. మండలం నుంచి అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నలుగురు వ్యక్తుల అరెస్ట్

పెద్దపల్లిటౌన్, నవంబరు 26 : (ఆంధ్రజ్యోతి) వారెంటైన నలుగురు వ్యక్తులను మంగళవారం పెద్దపల్లి పోలీసులు అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. జేఎఫ్‌సీఎమ్ పెద్దపల్లి కోర్టు ఆదేశాల మేరకు నాన్‌బెయిల్ వారెంటైన పెద్దపల్లి మండలం మూలసాలకు చెందిన కొయ్యడ చీరంజీవి, ఒయ్యడ ఎల్లయ్య, గోదావరిఖని చెందిన గజ్జెల్లి అంజయ్య, కనుమల్ల స్వరూపలను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరుపర్చినట్లు ఏసీపీ గజ్జికృష్ణ తెలిపారు.

జీపీ సిబ్బందికి సన్మానం

ముత్తారం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓడేడు గ్రామపంచాయతీలో సిబ్బందిని ఎంపీడీవో సురేష్ సమక్షంలో సన్మానం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తోట శంకర్, ఎండి మున్నా, రాజకుమార్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

- గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట సచిన్‌రెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి వెంకట సచిన్‌రెడ్డి

కోల్‌సిటీ, నవంబరు 26: భారత రాజ్యాంగ పరిరక్షణ పౌరులుగా ప్రజలందరి బాధ్యత అని గోదావరిఖని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్ వెంకట సచిన్‌రెడ్డి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. బార్ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి పులిపాక ప్రవీణ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు తౌటం సతీష్, నాయకులు గోషిక ప్రకాష్, మహేందర్, వరలక్ష్మి, న్యాయవాదులు చందాల శైలజ,సంజయ్ కుమార్, గొర్రె రమేష్, శ్రీనివాస్‌రావు, ఉమర్, కుమార్ పాల్గొన్నారు.

- కళ్యాణ్‌నగర్ (ఆంధ్రజ్యోతి): ఖని మున్సిపల్ టీ జంక్షన్ వద్ద కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు దాసరి విజయ్, తిప్పారపు శ్రీనివాస్, దీటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.
- యైటింక్లయిన్‌కాలనీ (ఆంధ్రజ్యోతి): కాలనీలో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. గుండేటి రాజేష్, చాట్ల సదానందం, శనిగరం తిరుపతి తదితరులు పాల్గొన్నారు. సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ నాయకులు పోతనకాలనీలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించారు.
- ఓదెల (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ కార్యాలయం తో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాకయ్య, ఎంపీడీవో తిరుపతి, మాటూరి రత్నం, సాతూరి అనిల్, పల్లె కనుకయ్య తదితరులు పాల్గొన్నారు.
- ఎలిగేడు (ఆంధ్రజ్యోతి) : రాములపల్లిలో అమృత్‌సరోవర్ ట్యాంకువద్ద ప్రతిజ్ఞ చేసి గ్రామపంచాయతీ కార్మికులు, ఉపాధిహామీ కూలీలను సన్మానించారు.
- ధర్మారం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శాయంపేట ప్రాథమిక పాఠశాలలో వేడుకలను నిర్వహించారు. మల్లాపూర్‌లో మార్కెట్ డైరెక్టర్ గందం మహిపాల్ ఉపాధి కూలీలను సత్కరించారు.
- జూలపల్లి (ఆంధ్రజ్యోతి) : పెద్దాపూర్ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో యువశక్తి వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్స్‌పాల్ యం.డి షాదుల్, ఒమేష్ పాల్గొన్నారు.
- ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు దర్యాపూర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో రాజ్యాంగం దినోత్సవం జరిగింది. ప్రిన్సిపాల్ కేసరి సంతోష్ కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.
- జ్యోతినగర్ (ఆంధ్రజ్యోతి) : ఎన్టీపీసీ పీటీఎస్‌లో ప్రభాత్ పేరీ పేరిట ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ వికాస కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎన్టీపీసీ జీఎం అలోక్ కుమార్ త్రిపాఠి ముఖ్య అతిధిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. జీఎం దాస్, ఏజీఎం(హెచ్ఆర్) విజయ్‌కుమార్ సిక్దర్, మహేంద్ర కుమార్, నవనీత్ రాథోడ్ పాల్గొన్నారు.
- కోల్‌సిటీటౌన్ (ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి పూలమాలలు వేశారు. శారదానగర్‌లోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.
- పెద్దపల్లి రూరల్ (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేడుకలను నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీనర్సయ్య, మురళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ సతీష్ కుమార్ పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో కాటిల్ షెడ్స్, ఉపాధి పనులను ప్రారంభించారు. గ్రామపంచాయతీల సిబ్బందికి ఎంపీడీవో పుష్పగుచ్ఛాలు అందజేసి స్పెషల్ అధికారి శ్రీనివాస్ పలువురిని సన్మానించారు.

- కాల్వశ్రీరాంపూర్ (ఆంధ్రజ్యోతి) : పెగడపల్లిలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా క్యాటిల్‌షెడ్ నిర్మాణానికి ఎంపీడీవో రామ్మోహనచారి మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం ఉపాధిహామీ కూలీలను, గ్రామపంచాయతీ సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలాగే కాల్వశ్రీరాంపూర్ మండల కేంద్రంలో వేడుకలు జరుపుకున్నారు. మాజీ జడ్పీటీసీ లంక సదయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ రాజమల్లు పాల్గొన్నారు.

- సుల్తానాబాద్ (ఆంధ్రజ్యోతి): సుద్దాలలో ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్యగౌడ్ మంగళవారం సుల్తానాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాశ్‌రావుతో కలిసి ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం పనుల జాతర నిర్వహించారు. ఎంపీడీఓ దివ్యదర్శన్‌రావు, ఈజీఎస్ ఏపీఓ మల్లీశ్వరి, మండల పంచాయతీ అధికారి సమ్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.
- పాలకుర్తి (ఆంధ్రజ్యోతి): వేమునూర్‌లో ఉపాధి హామీ పనుల జాతర ప్రారంభించారు. పొన్నం సత్తయ్య గౌడ్, గుమ్ముల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.
- కోల్‌సిటీ (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ కార్యాలయంలో వేడుకలు జరిగాయి. మేయర్ బంగి అనీల్ కుమార్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

సర్వే వివరాల నమోదును వేగవంతం చేయాలి

(5వ పేజీ తరువాయి)

నరేందర్ తనిఖీ చేపట్టారు. గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా డేటా ఎంట్రీ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శైలజారాణి, సూపరిండెంట్ ఉమేష్, పంచాయితి కార్యదర్శులు, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

- ముత్తారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14గ్రామపంచాయతీల్లో చేపట్టిన సర్వే వివరాలను ఆన్‌లైన్ ప్రక్రియను ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభించారు. కంప్యూటర్ ఆపరేటర్ల ద్వారా ఆన్లైన్ చేస్తున్నట్లు ఎంపీడీవో సురేష్ పేర్కొన్నారు. సర్వేలో పాల్గొనని కుటుంబాలు స్వచ్ఛందంగా సర్వే చేయించుకోవాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

ముత్తారం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కస్తూర్బా ఆశ్రమ పాఠశాలలో మంగళవారం డీఈవో మాధవి తనిఖీ నిర్వహించారు. పాఠశాలలో జరిగిన రాజ్యాంగ దినోత్సవంలో పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థినులతో పాటు రాజ్యంగ ప్రతిజ్ఞ చేయడం జరిగింది. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ పాఠశాలతో పాటు ఆవరణను పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి స్వప్న, సోషల్ సీఆర్‌టీ మనోలత, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి క్వింటాలుకు ధర రూ.6,991

పెద్దపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంగ ళవారం క్వింటాలు పత్తికి అత్యధికంగా 6,991 రూపాయల ధర పలికింది, అత్యల్పం గా 6,088 రూపాయలు, మోడల్ ధర 6,761 రూపాయల ధర పలికింది. మార్కెట్‌కు 490 సంచుల్లో 539 క్వింటాళ్ల పత్తిని 145 మంది రైతులు తీసుకవచ్చారని మా ర్కెట్ అధికారులు పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడికి డాక్టరేట్

పెద్దపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు చెక్కపెల్లి తిరుపతి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే లక్ష్మీనర్సయ్య తెలిపారు. ప్రొఫెసర్ సునితాదేవి పర్యవేక్షణలో చానా స్ట్రయేట చేప పెరుగుదల, రక్త, జీవరసాయన అంశాలపై సిట్రిక్ ఆమ్ల ప్రభావం అనే అంశంపైన చేసిన పరిశోధనకు డాక్టరేట్ వచ్చినట్టు తిరుపతి తెలిపారు. తిరుపతిని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు సన్మానించి అభినందించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి శానిటేషన్ పనుల శిక్ష

- నేడు అమలు చేయనున్న ట్రాఫిక్ పోలీసులు

పెద్దపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ పట్టుబడిన ఇద్దరికి జడ్జి మంజుల కోర్టు క్లీనింగ్ పనుల శిక్ష విధించారు. శుక్రవారం వాహనాల తనిఖీల్లో మద్యం సేవించి పట్టుబడ్డ మొత్తం 13 మందిని పెద్దపల్లి ట్రాఫిక్ పోలీసులు స్థానిక కోర్టులో హాజరు పరిచారు. వారిని విచారించిన న్యాయమూర్తి మంజుల 13 మందికి 14,500 రూపాయల జరిమానా విధించారు. అయితే అత్యధికంగా మద్యం సేవించి వాహనం నడిపిన సుల్తానాబాద్ మండలం సుద్దాల గ్రామానికి చెందిన మామిడి రమేష్, పెద్దపల్లికి చెందిన పంకజ్‌లకు 500 రూపాయల జరిమానాతో పాటు సామాజిక సేవలో భాగంగా మూడు రోజులపాటు జిల్లా కోర్టు పెద్దపల్లిలో క్లీనింగ్ పనులు చేయాలని తీర్పునిచ్చారు. ఈ మేరకు బుధ, గురు, శుక్ర వారాల్లో క్లీనింగ్ పనుల్లో ఉపయోగించుకోవాలని ట్రాఫిక్ పోలీసులను ఆదేశించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

శ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్‌కు చెందిన రాజశేఖర్ మంచిర్యాలలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. మంగళవారం స్వగ్రామానికి బైక్‌పై వెళ్తూ శ్రీరాంపూర్ బస్టాండ్ దాటిన తరువాత సింగరేణి ఓబీ కంపెనీకి చెందిన బొలెరో వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. రోడ్డుపై పడిపోవడంతో అతనికి గాయాలయ్యాయి. స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. ఈ విషయంపై శ్రీరాంపూర్ ఎస్ఐ సంతోష్‌ను అడుగగా, తమకు ఎవరూ ఫిర్యాదు ఇవ్వలేదని పేర్కొన్నారు.

రాంగ్ రూట్లో వస్తున్న వాహనాలకు జరిమానాలు

సుల్తానాబాద్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు నిలయమైన రాజీవ్ రహదారి శీర్షికను 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి పోలీసులు స్పందించారు. రాజీవ్ రహదారిపై రైసు మిల్లుల ప్రాంతంలో రాంగ్ రూట్లో వస్తున్న వాహనాల మూలంగా అనేక ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారనే కథనానికి స్పందించిన పోలీసులు రెండు రోజులుగా తనిఖీ చేస్తున్నారు. రాంగ్ రూట్లో వస్తున్న వాహనాలను పట్టుకుని వారికి జరిమానాలు విధిస్తున్నారు. అలాగే డ్రంకైన్ డ్రైవ్ తనిఖీలు కూడా చేస్తూ కేసులు నమోదు చేస్తున్నారు.

సొసైటీ అక్రమాలపై అధికారులు స్పందించాలి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పందిళ్ల గ్రామంలోగల ముదిరాజ్ సొసైటీలో జరుగుతున్న అక్రమాలపై సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్థులు కందుల రాజేశం, కందుల స్వామి, పోతరవేన మల్లేష్, పాతరవేన స్వామి అన్నారు. మంగళవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ ముదిరాజ్ సొసైటీలో అక్రమాలు జరిగాయి అంటూ ప్రజావాణిలో ఫిరాధు చేసిన స్పందనలే దని, దీంతో న్యాయస్థానంలో ఆశ్రయించడం జరిగిందన్నారు. న్యాయస్థానం నుండి సంబంధిత అధికారులకు విచారించవలసిన ఆదేశాలు వచ్చినా పట్టించుకోవడంలేదని వారు ఆరోపించారు. ఈ విషయంపై మత్స్యశాఖ జిల్లా అధికారి నరేష్‌కుమార్‌నాయుడును వివరణ కోరగా సొసైటీలో అక్రమాలు జరిగిన విషయంపై విచారిస్తున్నామని అన్నారు.

మాజీ ఎమ్మెల్యే ఆరోపణలు అవాస్తవం

పాలకుర్తి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ కేశోరాం పర్మినెంటు కార్మికులకు మెరుగైన దీపావళి బోనస్ కోసం సమ్మెను తప్పుపడుతూ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ చేసిన ఆరోపణలు అవాస్తవాలని పర్మినెంటు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బయ్యపు మనోహర్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం మనోహర్‌రెడ్డి పాత్రికేయులతో మాట్లాడుతూ యూనియన్ గౌరవ అధ్యక్షుడు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌పై చందర్ చేస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పర్యవేణి శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



సత్యనారాయణగౌడ్‌ను సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కమాన్‌పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సెపక్ తక్రా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పూదరి సత్యనారాయణగౌడ్ ఎంపికకావడాన్ని హర్షిస్తూ మంగళవారం బీఆర్ఎస్ నాయకులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బొమ్మ గాని అనిల్‌గౌడ్, కన్వీనర్ తాటికొండ శంకర్, రామగిరి మండలాధ్యక్షుడు శెంకేషి రవీందర్, మాజీ ఎంపీటీసీ బోనాల వెంకటేష్ మాజీ సర్పంచ్‌లు నీలం శ్రీనివాస్, ఆకుల గట్టయ్య, కాపురవేన భాస్కర్ తదితరులు ఉన్నారు.

ఎన్టీపీసీలో జేఏసీ నిరసన ప్రదర్శన



ఎన్టీపీసీలో నిరసన వ్యక్తం చేస్తున్న జేఏసీ నాయకులు

జ్యోతినగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మంగళవారం ఎన్టీపీసీ ప్రాజెక్టు వద్ద జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన చేశారు. జాతీయ కార్మిక సంఘాల ఐక్య ఫ్రంట్ పిలుపులో భాగంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడతూ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్మికచట్టాలను సవరించి కార్మిక హక్కుల్ని హరించే కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంట్రాక్టు కార్మికులకు 26వేల రూపాయల కనీస వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాంసాని శంకర్, ఎండీ యాకూబ్, చిలుక శంకర్, నాగభూషణం, భూమయ్య, వెంకటేష్, జమీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాపాయస్థితిలో ఉన్న యువకుడికి సహాయం

కోల్‌సిటీటౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న రామగుండం కార్పొరేషన్ 27వ డివిజన్‌లోని గాంధీనగర్‌కి చెందిన సమీర్ రహమతుల్లా అనే యువకుడికి వైద్య ఖర్చుల నిమిత్తం మంగళవారం వీహెచ్‌ఆర్ ఫౌండేషన్ రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేసింది. క్యాటరింగ్ సర్వీసులో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకున్న సమీర్ రోడ్డు ప్రమాదానికి గురై వైద్య చికిత్స పొందుతున్నాడని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సిగిరి రాము, ఎస్ యుగేందర్, సదానందం, రాకేష్, మహమూద్, షఫీలతో పాటు సమీర్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ జాతీయ కరాటే పోటీలకు ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మంథని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌జీఎఫ్ జాతీయ కరాటే పోటీలకు మంథని షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ఎంపికైనట్లు కోచ్ కోంద్ర నాగరాజు మంగళవారం తెలిపారు. ఎన్‌టీపీసీలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో తమ విద్యార్థులు బేరా అధిత్యతేజ, పొట్ల శ్రావణ్‌కుమార్, రంగు శ్రీచరణ్‌లు గోల్డ్ మెడల్స్, తోట హాసిని సిల్వర్ మెడల్ సాధించి డిసెంబర్ 9 నుంచి 16 తేదీ వరకు ఢిల్లీలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. ఎస్‌జీఎఫ్ జాతీయ స్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విద్యార్థుల ను, కోచ్ కోంద్ర నాగరాజులను గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, జేకేప సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, ఎస్‌జీఎఫ్ జిల్లా సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్, పీఈటీ మాధురి, శంకర్ గౌడ్, పెటా జిల్లా అధ్యక్షుడు సురేందర్, పీడీలు శోభారాణి, తిరుపతి, ప్రకాష్, ఖజాబీలు అభినందించారు.



ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జీఎం

రామగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-3, ఏపీఏలో గుర్తింపు సంఘం ప్రతినిధులతో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. జీఎం కార్యాలయంలో మంగళవారం ఆర్జీ-3, ఏపీఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఏరియాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారంపై చర్చించారు. అందులో ప్రధానంగా ఓపెన్ కాస్టు ప్రాజెక్టుల్లో షావల్స్, డంపర్స్, డోజర్స్ డ్రిల్స్‌లలో ఏసీ సదుపాయాన్ని కొనసాగిస్తూ సరిపడే విడి భాగాలను సమకూర్చాలని గుర్తింపు సంఘం నేతలు ప్రతిపాదనలు చేశారు. దీంతో పాటు పలు ప్రధాన డిమాండ్‌లపై యాజమాన్యం దృష్టికి తీసికెళ్ళారు. వీటి జీఎంలు సానుకూలంగా స్పందించారు. సమావేశంలో గుర్తింపు సంఘం నాయకులు జూపాక రాంచందర్,డిటిరావు, విజయ్, రాఘవ, అధికారులు శేఖర్‌బాబు, రఘుపతి, సత్యనారయణ, రామ్మోహన్, చంద్రశేఖర్, సుదర్శనం, రాజేంద్రకుమార్, ఉదయ్‌హరిజన్, రామారావు, మతీన్ తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-5లో షావల్ దగ్ధం

గోదావరిఖని, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆర్‌జీ-1 పరిధిలోని జీడీకే-5 ఓసీపీలో మంగళవారం రెండవ షిఫ్టులో ప్రమాదశవాత్తు ఆయిల్ లీకేజీతో షావల్ యంత్రం అగ్నికి ఆహుతయ్యింది. కోల్ లిఫ్ట్ చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో షావల్ యంత్రం పూర్తిగా దగ్ధమైంది. దీని విలువ సుమారు రూ.కోటి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ప్రమాద స్థలంలో కార్మికులు లేకపోవడంతో భారీ నష్టం తప్పింది.

గనులపై ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



ఆర్జీ-2 జీఎం ఆఫీస్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఆర్జీ-2 యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జీఎం బండి వెంకటయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఉద్యోగులు రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జీ రవీందర్, ఎస్టోటూ జీఎం రాముడు, అధికారుల సంఘం ప్రతినిధి నితిన్ కుమార్, అధికారులు సంతోష్ కుమార్, అనిల్‌కుమార్, ధనుంజయ, మురళీకృష్ణ, వెంకట రామచంద్ర, మురళీకృష్ణ, షరీఫ్ మహ్మద్, పండీనాథ్‌తో పాటు జీఎం ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

- రామగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన హక్కులను సద్వినియోగంతో పాటు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ప్రతి పౌరుడికి ఉందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్‌రావు, శేఖర్‌బాబు, చంద్రశేఖర్, రాజారెడ్డి, సుదర్శనం, ఐలయ్య సత్యనారాయణ, రాజేశ్వరి, కోల శ్రీనివాస్, శ్రీహరి, సునీల్‌ప్రసాద్, రాజేశం, మతిన్ హుస్సెన్, విక్రమ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తాం..



గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే లక్ష్యంగా ఐఎన్‌టీయూసీ పనిచేస్తున్నట్టు యూనియన్ ఆర్జీ-3 వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి, సెంట్రల్ సెక్రెటరీ గడ్డం తిరుపతిలు పేర్కొన్నారు. మంగళవారం ఓసీపీ1 సైటాఫీస్‌లో జరిగిన గేట్‌మీటింగ్‌లో వారు మాట్లాడారు. గోదావరిఖనిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణ దశలో ఉన్నదని, ఇది పూర్తయితే కార్మికులకు, ఈప్రాంత ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందుబాటు లోకి వస్తుందని తెలిపారు. డిపెండెంట్ల వయోపరిమితిని 40ఏళ్ళకు పెంచడం, కాంట్రాక్టు కార్మికలకు 5000 బోనస్ ఇప్పించడం ఐఎన్‌టీయూసీ కృషి ఫలితంగా జరిగినట్టు పేర్కొన్నారు. సెంటినరీ కాలనీ నుంచి గోదావరిఖని వరకు కోల్‌కారిడార్ రోడ్డును నాలుగులైన్ల ఆధునీకరించాలని మంత్రి శ్రీధర్‌బాబు సింగరేణి యాజమా న్యానికి సూచించినట్టు రవీందర్‌రెడ్డి, తిరుపతిలు తెలిపారు. సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ఐటీ రీయంబర్స్, ఈపీ ఆపరేటర్ల ప్రమోషన్లు ఇచ్చేలా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్ళినట్టు తెలిపారు. ఈ సమావేశంలో పిట్ సెక్రెటరీ వెంకటస్వామి, బ్రాంచి సెక్రెటరీ శ్రీనివాసరావు, ప్రభాకర్‌రెడ్డి, సదానందం, ఆనంద్, ప్రవీణ్‌రెడ్డి, విజయ్, రాజన్న, తిరుమలేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

పెద్దపల్లిటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెద్దపల్లి జిల్లా కేవీపీఎస్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కల్లెపల్లి అశోక్, బీఎస్ఎస్ రాష్ట అధ్యక్షుడు జనగామ నరేశ్, మొదుంపల్లి శ్రావణ్ అరికిల్ల రామలక్ష్మి కుమ్మరి నవీన్,సూరజ్, శ్రీశైలం, సందీప్, మమత పాల్గొన్నారు

ఆత్మీయ సమ్మేళనం

కోల్‌సిటీటౌన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): మాదిగ మిత్రమండలి ఆధ్వర్యంలో మంగళవారం గోదావరిఖనిలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాదిగ మిత్రమండలి వ్యవస్థాపకులు ఆసంపల్లి శ్రీనివాస్(వాసు) హాజరై మాట్లాడారు. అనంతరం పలురంగాల్లో రాణిస్తున్న మాదిగ కులబాంధవులను సన్మానించారు. కోటగిరి పాపయ్య, కార్పొరేటర్ పులేందర్, ఉప్పులేటి పర్వతాలు, రాసపల్లి రవికుమార్, పల్లె బాబు, మాతంగి కుమార్, హక్కుల వడ్లూరి శ్రీనివాస్ పులిపాక శ్రీహరి పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

ఓదెల, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కనగర్తి దాసరి పద్మ, హనుమయ్య హైస్కూల్లో మంగళవారం షీటీం ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువకులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఇన్‌చార్జి మల్లయ్య, షీ టీం సభ్యురాలు స్నేహలత పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఎంఈఓ రమేష్, షీ టీం సభ్యులు సురేష్, భరోసా కోఆర్డినేటర్ ఆశ్రిత, అస్మా, పాల్గొన్నారు.

సమన్వయ సమావేశం

పెద్దపల్లి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఓటరుజాబితాలో చేర్పుల మార్పుల కోసం మండల పరిషత్ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో శ్రీనివాస్ సమన్వయ సమావేశం నిర్వహించారు. మార్పులు చేర్పులు ఉంటే తెలుపాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. ఎంపీవో ఫయాజ్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కమాన్‌పూర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కమాన్‌పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని పిల్లిపల్లె ఎల్లమ్మగుడి వద్ద అసంపూర్తిగా నిలిచిన గౌడ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులను మంజూరుచేయాలని కోరుతూ మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు గౌడ కులస్థులు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎంపీపీ మల్యాల రామచంద్రన్‌గౌడ్, నగునూరి నరసయ్యగౌడ్, రంగు సత్యనారాయణగౌడ్, వెంగలి రాజయ్యగౌడ్, రంగు శ్రీనివాస్‌గౌడ్, మల్యాల సతీష్, బుర్ర శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.